క్లుప్తంగా

డుంబ్రిగుడలో భారీ వర్షం



డుంబ్రిగుడలో కురుస్తున్న వర్షం

డుంబ్రిగుడ: మండలంలోని ఆదివారం భారీ వర్షం కురిసింది. ఉదయం పొగమంచు కమ్ముకోగా, మధ్యాహ్నం 12 గంటల నుంచి సుమారు రెండు గంటల పాటు వర్షం భారీగా వర్షం కురిసింది. మండల కేంద్రానికి వచ్చిన జనజీవనం ఇబ్బందులు పడ్డారు. కించుమండ, డుంబ్రిగుడ, అరకు, గుంటసీమల తదితర ప్రాంతాల్లోని గెడ్డలు, వాగులు ఉధృతంగా ప్రవహించాయి. పొలాల్లో నీరు చేరింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు వరి పంటకు ఎంతో మేలు చేస్తుందని రైతులు సంతోషం వ్యక్తం చేశారు. సాయంత్రం 4:30 నుంచి ఎండ కాసింది.

నులిపురుగు నివారణ మాత్రల పంపిణీకి చర్యలు



ఎంపీడీవో యాదగిరీశ్వరరావు

రాజవొమ్మంగి: డీ వార్మింగ్ మాత్రల పంపిణీకు సంబంధించి ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం 11వ తేదీ, ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో యాదగిరీశ్వరరావు తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఈ సమావేశానికి ఎంఈవోలు, అన్ని పాఠశాలల హెచ్ఎంలు, పీహెచ్‌సీకి సంభందించిన సీహెచ్‌వో, ఎంపీహెచ్‌వో, హెచ్‌వీ, రాజవొమ్మంగి పీహెచ్‌సీ పరిధిలోని అందరు ఆశ, ఏఎన్ఎంలు తప్పక హాజరుకావాలని కోరారు. నులిపురుగు నివారణ మాత్రల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామన్నారు. పాఠశాలల్లో మంగళవారం నుంచి డీవార్మింగ్ మాత్రల పంపిణీ చేపట్టనున్నట్టు చెప్పారు.

ఉత్సాహంగా వాకర్స్ ఆటల పోటీలు



పరుగు పందెంలో తలపడుతున్న వాకర్స్

చోడవరం: స్థానిక వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వాకర్స్‌కు ఆదివారం ఆటల పోటీలు నిర్వహించారు. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏటా చోడవరం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్టు క్లబ్ అధ్యక్షుడు ఓరుగంటి రాంబాబు చెప్పారు. ఈ క్లబ్‌లో 45 80 ఏళ్ల వయస్సున్న వారంతా సభ్యులుగా ఉన్నారన్నారు. వీరంతా ఈ పోటీల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. రన్నింగ్, వాకింగ్, మ్యూజికల్ చైర్, టగ్ ఆఫ్ వార్, తదితర పోటీలు పాల్గొని సత్తా చాటారు. విజేతలకు స్వాతంత్ర్య దినోత్సవం రోజున బహుమతులు అందజేయనున్నారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం

కె.కోటపాడు : ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యం కోసం రోజూ ధ్యానం చేయడం అలవాటు చేసుకోవాలని సీనియర్ పిరమిడ్ మాస్టర్ డాక్టర్ శివ కోరారు. చౌడువాడలో ఆత్మజ్యోతి పిరమిడ్ ధ్యాన కేంద్రం వద్ద శనివారం రాత్రి పౌర్ణమి ధ్యానంను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ శివ మాట్లాడుతూ ఎటువంటి ఖర్చు లేకుండా ప్రతి ఒక్కరూ మంచి ఆరోగ్యం , ఒత్తిళ్లను అధిగమించేందుకు శ్వాస మీద ధ్యాస పెట్టాలని సూచించారు. శ్వాస మీద ధ్యాస ద్వారా దీర్ఘకాలిక వ్యాధులు తగ్గుతాయన్నారు. నా అనే పదాన్ని వదిలి అందరూ మనం అనే విధంగా ముందుకు సాగాలని ఆయన సూచించారు. పౌర్ణమి ధ్యాన కార్యక్రమానికి హాజరైన వారితో ధ్యానం చేయించారు. అనంతరం శివను ఆత్మజ్యోతి పిరమిడ్ నిర్వాహకులు, పిరమిడ్ మాస్టర్‌లు బీశెట్టి మీనా, మహోహర్, సత్యనారాయణ, నాగ అప్పారావు, వెంకటరావు సన్మానించారు.

మోదకొండమ్మ ఆలయానికి విరాళం



ఆలయానికి సిమెంట్ విరాళంగా అందజేస్తున్న ఉమేష్

మునగపాక: స్థానిక బైపాస్ రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న మోదకొండమ్మ ఆలయానికి పలువురు భక్తులు తమవంతు విరాళాలు అందజేస్తున్నారు. ఆదివారం మునగపాకకు చెందిన కాంట్రాక్టర్ పెంటకోట ఉమేష్ తనవంతు సాయంగా 50 సిమెంట్ బస్తాలను విరాళంగా ప్రకటించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



బంగారుమెట్టలో శిథిలావస్థలో ఉపాధ్యాయుల క్వార్టర్స్



లక్ష్మీపురంలో శిథిల దశలో ఉపాధ్యాయుల క్వార్టర్స్

బిక్కు బిక్కుమంటూ..

- శిథిలావస్థలో ఉపాధ్యాయుల క్వార్టర్స్
- పాడైన కిటికీలు, తలుపులు, బీటలు వారిన గోడలు
- టార్పాలిన్లు కట్టుకొని నివాసముంటున్న వైనం
- విష సర్పాల సంచారం
- భయం భయంగా కుటుంబాల నివాసం
- పట్టించుకోని యంత్రాంగం

ముంచంగిపుట్టు: మండలంలోనిఇ ఉపాధ్యాయుల క్వార్టర్స్ భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎప్పుడు ఏ భవనం పడిపోతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన భవనాలు కావడంతో భవనాలు పూర్తిగా పాడైపోయాయి. కొన్ని భవనాలు పూర్తిగా శిథిలం కాగా మరికొన్ని భవనాల్లో కొంతమంది ఉపాధ్యాయులు భయం భయంగా నివసిస్తున్నారు. 1995లో నిర్మించిన భవనాలు కావడంతో గోడలు బీటలు వారి తలుపులు, కిటికీలు పాడై దర్శనమిస్తున్నాయి. కొన్ని భవనాల్లోని గదుల్లో వర్షపునీరు చేరుతోంది. దీంతో పైకప్పుపై తాత్కాలికంగా టార్పాలను కట్టుకొని నివసిస్తున్నారు. ముంచంగిపుట్టు మండల కేంద్రంతో పాటు లక్ష్మీపురం, పనసపుట్టు,పెదగూడ, బంగారుమెట్ట, లబ్బూరు గ్రామాల్లో ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు నివాసించేందుకు వీలుగా ఈ భవనాలు నిర్మించారు. అవి ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి. కొంతమంది ఉపాధ్యాయులు వాటిలో సర్దుకుపోయి నివాసం ఉంటున్నారు. మరికొంత మంది అద్దె భవనాల్లో ఉంటున్నారు. ఇప్పటికే ఈ భవనాలు నిర్మించి 30 సంవత్సరాలు పైగా కావడంతో ప్రస్తుతం నివాసించేందుకు వీలులేకుండా పోయింది. శిథిల భవనాలు కావడంతో క్వార్టర్స్‌లో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోయి విష సర్పాలకు నిలయంగా మారుతున్నాయి. భయం భయంగా నివసిస్తున్న కొంత మంది ఉపాధ్యాయుల ఇళ్లల్లోకి అప్పుడప్పుడు విష సర్పాలు వస్తుపోతుండడంతో ఆందోళన చెందుతున్నారు. దెబ్బతిన్న భవనాలకు మరమ్మతులు చేయాలని, పూర్తిగా శిథిలమైన వాటిని వెంటనే కూల్చివేసి నూతన భవనాలు నిర్మించాలని పలువురు కోరుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని పలువురు ఉపాధ్యాయులు కోరుతున్నారు.

సర్వేలతో కాలయాపన

ఉపాధ్యాయుల క్వార్టర్స్ భవనాలు పరిస్థితిని గతంలో ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో అనేకసార్లు భవనాల స్థితిగతులపై అధికారులు సర్వే చేశారు. భవనాల పరిస్థితి దారుణంగా ఉండడం పట్ల కూల్చివేయాలని ప్రస్తుతం నివాసం ఉంటున్న వారు సైతం భవనాలను ఖాళీ చేయాలని అధికారులు సూచించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపించి నిధులు మంజూరైన వెంటనే నూతన భవనాల నిర్మాణాల ప్రక్రియ మొదలు కావచ్చని అభిప్రాయం వ్యక్తం చేశారు. దీంతో నివాస భవనాల సమస్య తీరుతుందని వారంతా భావించారు. కాని సర్వేతోనే అధికారులు సరిపెట్టారని పనులేవీ ప్రారంభానికి నోచుకోలేదని పలువురు చెబుతున్నారు. శిథిల భవనాలపై అధికారుల నిర్లక్ష్యం అక్కడ ఉంటున్న ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారింది.

అధికారుల దృష్టికి సమస్య



ఉపాధ్యాయుల క్వార్టర్స్ భవనాలు శిథిలావస్థకు చేరుకుంది. కొంతమంది ఇప్పటికే భవనాలు ఖాళీ చేశారు. మరికొంత మంది భవనాలపై టార్పాలిన్లు ఏర్పాటుచేసుకొని నివసిస్తున్నారు. శిథిల భవనాల పరిస్థితిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. నిధులు మంజూరైతే భవనాలు సమకూరితే ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులకు వసతి సమస్య తీరుతుంది.

– స్వర్ణలత, ఏటీడబ్లూవో, ముంచంగిపుట్టు మండలం



ముంచంగిపుట్టులో ఉపాధ్యాయుల క్వార్టర్స్‌లో పాడైన తలుపు



ఉపాధ్యాయుల క్వార్టర్స్ కిటికీలు



ముంచంగిపుట్టు బాలుర పాఠశాల ఉపాధ్యాయుల క్వార్టర్స్ పరిస్థితి

కాంట్రాక్టు ఉద్యోగులకు న్యాయం చేయాలి

జి.మాడుగుల: ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖలో విధులు నిర్వహిస్తున్న పారా మెడికల్ కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని పారా మెడికల్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి సప్పి బాలయ్య ఒక ప్రకటనలో తెలిపారు.2015సంవత్సరంలో గిరిజన ప్రాంతమైన పాడేరు ఐటిడిఏ ద్వారా వైద్యారోగ్యశాఖలో పది సంవత్సరాల నుంచి కాంట్రాక్టు పద్ధతిలో పారా మెడికల్ ఉద్యోగులుగా విధులు నిర్వహిర్తిసున్నామని ఆయన చెప్పారు. చాలీచాలని వేతనాలతో కుటుంబాలు ఇనేక ఆర్థికపరమైన సమస్యలు ఇబ్బందులు పడుతున్నామన్నారు. పారా మెడికల్ ఉద్యోగులను రెగ్యులర్ చేసి 100శాతం గ్రాస్ జీతాలు అందించాలని, వారికి న్యాయం చేయాలని ఆయన కోరారు. పారామెడికల్ ఉద్యోగుల సంఘం నాయకులు శంకర్రావు, సంతోషి పాల్గొన్నారు.

రాత్రిళ్లు పశువుల సంచారం లేకుండా చూడాలి



పశువులు నష్టం చేసిన వరిపైరును చూపిస్తున్న రైతు

వి.ఆర్.పురం: గ్రామల్లో రాత్రిపూట పశువులను కట్టాలని స్థానిక రైతులు కోరుతున్నారు. వరి నాట్లుకు సిద్ధంగా ఉన్న పొలాల్లో రాత్రిళ్లు పశువులు చొరబడి నాశనం చేస్తున్నాయని పశువులు నాశనం చేస్తున్నాయని పలువురు రైతులు రైతులు నరేష్, వెంకటేశ్వరు, శ్రీను, తదితరులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పశువులు రాత్రిపూట సంచరించకుండా పంచాయతీ అధికారులు చాటింపు చేయాలని కోరుతున్నారు. పశువుల యజమానులకు సూచనలు, ఆదేశాలు జారీ చేయాలన్నారు. నిబంధనలు అతిక్రమించే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. పశువులు గ్రామాలోని వరి, రాగులు, ఇతరత్రా పంటల్లోకి రాత్రిళ్లు చొరబడి మొత్తం పంటను నాశనం చేస్తున్నాయని, దీంతో తీరని నష్టం జరుగుతుందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



రాజవొమ్మంగిలో నినాదాలు చేస్తున్న యూటీఎఫ్ నాయకులు



గంగవరం పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు



డుంబ్రిగుడలో యూటీఎఫ్ జెండాకు వందనం సమర్పిస్తున్న నాయకులు



ముంచంగిపుట్టులో యూటీఎఫ్ జెండా ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులు

డుంబ్రిగుడ: ఏటీయూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ఎంపీపీ పాఠశాల ఆవరణలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వి.మహేశ్వరరావు ఆధ్వర్యంలో యూటీఎఫ్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి అమరజీవులు చెన్నుపాటి లక్ష్మయ్య, దాచూరి రామిరెడ్డి, అప్పారి వెంకటస్వామి వంటి మహానుభావులు అహర్నిశలు శ్రమించి వారి త్యాగాలతో ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ పురుడు పోసుకుందన్నారు. ఉపాధ్యాయ సమస్యల పోరాటంలో యూటీఎఫ్ అగ్రగామిగా నిలిచిందన్నారు. యూటీఎఫ్ ప్రతినిధులు కన్నయ్య, బాబురావు, బాలకృష్ణ, రాజారావు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో ఆదివారం జరిగిన యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మొశ్యా ధర్మారావు పాల్గొని మాట్లాడుతూ యూటీఎఫ్ ఉద్యమ ప్రస్థానంలో అనేక అలుపెరుగని పోరాటాలు చేసి ఉపాధ్యాయుల అండగా నిలిచిందన్నారు. అమర జీవి చెన్నుపాటి ఆశయాల బాటలో పయనిస్తూ రాష్ట్రంలో అతిపెద్ద సంఘంగా ఏర్పాడిందన్నారు. సీపీఎస్ రద్దుకై యూటీఎఫ్ నిరంతరం పోరాడుతూనే ఉందన్నారు. యూటీఎఫ్ ప్రతినిధులు రాజు, గోపి, సూర్యనారాయణ, చిన్నయ్య, సిద్దేశ్వరరావు, ఉపాధ్యాయులు త్రినాథం, శ్రీనివాసమూర్తి, ధనుపతి, గోవింద్, తిరుపతి, రఘుమణి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

గంగవరం: మండల కేంద్రంలో ఆదివారం జరిగిన యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం కార్యక్రమంలో యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు సీహెచ్.రాంబాబు దొర మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు , ఉపాధ్యాయుల సంక్షేమానికి యూటీఎఫ్ అవిశ్రాంత పోరాటాలు, అసాధారణ విజయాలు సాధించిందన్నారు. అనంతరం స్థానిక పీహెచ్‌సీలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. యూటీఎఫ్ ప్రతినిధులు బొజ్జిదొర, వెంకటేశ్వర రావు, రుక్మిణి దేవి, రామకృష్ణారెడ్డి,"సరాంబాబు, సత్యనారాయణ దొర, వెంకటేశ్వరరావు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండల కేంద్రంలో ఆదివారం జరిగిన యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం కార్యక్రమంలో యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి కానెం శ్రీను, రిటైర్డ్ హెచ్ఎం కృష్ణవర్మ మాట్లాడుతూ యూటీఎఫ్ ఉపాధ్యాయుల సంక్షేమానికి ఎంతో పోరాడుతోందన్నారు. తరగతి గదిలో బోధన సమయాన్ని హరిస్తున్న యాప్‌లను, ఆన్‌లైన్ వర్క్‌లను రద్దు చేయాలని ఆయన విద్యాశాఖను డిమాండ్ చేశారు. యూటీఎఫ్ ప్రతినిధులు శ్రీను, రమేష్, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

వీధుల్లో కుక్కల స్వైరవిహారం



సిల్వర్ కాలనీలో సంచరిస్తున్న కుక్కల గుంపులు

పాడేరు రూరల్: మండల కేంద్రంలోని రేకులకాలనీ, సిల్వర్ కాలనీ, సుండ్రుపుట్టు, లోచలిపుట్టు, సొకలిపేట, గుడివాడ, బకలుపనుకు, పాత్త పాడేరు వివిధ ప్రాంతాల్లో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లో వ్యర్థాలు, చెత్తచెదారాలు పేరుకుపోవడంతో డంపింగ్ యార్డులు తలపిస్తున్నాయి. ఆయా పరిసరాల చుట్టూ కుక్కలు గుంపులుగా చేరుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. చిన్నారులు, వృద్ధులపై వీధి కుక్కలు దాడి చేసి గాయపరుస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.రోజురోజుకు వీధి కుక్కల దాడుల్లో గాయపడుతున్న వారి సంఖ్య పెరుగుతోందని చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

గంగాలమ్మ తల్లి మాలధారణ



గంగాలమ్మ తల్లిని దర్శించుకుంటున్న మాలధారులు

మునగపాక: మండలంలోని మూలపేటలో ఆదివారం భక్తులు గంగాలమ్మ తల్లి మాలలు ధరించారు. ఈ నెల 19వ తేదీన జరగనున్న ఆలయ ప్రథమ వార్షికోత్సవంలో భాగంగా మాలధారణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాలధారులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు.

13న మండల సమావేశం

పెదబయలు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10 గంటల నుంచి ప్రారంభం అవుతుందని స్థానిక ఎంపీడీవో ఎల్. పూర్ణయ్య తెలిపారు. మండల పరిషత్ అధ్యక్షురాలి సూచన మేరకు మండలంలోని అన్ని శాఖల ప్రగతిపై శాఖల వారీగా సమీక్ష చేయనున్నట్టు చెప్పారు. మండలంలోని జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, 23 గ్రామ సర్పంచ్‌లు అన్ని శాఖల అధికారులు విధిగా సమావేశానికి హాజరు కావాలని కోరారు.

బోసిపోయిన చాపరాయి జలపాతం



సందర్శకులు లేక బోసిపోయిన చాపరాయి జలపాతం

డుంబ్రిగుడ: మండలంలోని పర్యాట కేంద్రం చాపరాయి జలపాతం వద్ద ఆదివారం పర్యాటకులు తగ్గుముఖం పట్టడంతో వెలవెలబోయింది. గతవారం కంటే ఈవారం పర్యాటకులు రాకపోవడంతో చాపరాయికి వచ్చే ఆదాయానికి గండి పడినట్టు చాపరాయి నిర్వాహకులు తెలిపారు. పర్యాటకులు రాకపోవడంతో వ్యాపారాలు జరగక స్థానిక చిరు వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు.

వైభవంగా ఘటాల ఊరేగింపు



ఊరేగింపులో భక్తులు

అనకాపల్లి: స్థానిక కోట్నివీధి మరిడిమాంబ మహోత్సవాన్ని ఈ నెల 14వ తేదీన ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కోట్ని పూర్ణచంద్రరావు చెప్పారు. అమ్మ వారి మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఘటాల ఊరేగింపు కార్యక్రమాన్ని పురవీధుల్లో నిర్వహించారు. అమ్మవారి మహోత్సవానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు హరినాథ్, తలారి లక్ష్మీ ప్రసాద్, కోట్ని రామకృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

ఆలయ భూముల కౌలు వేలం రేపు

ఎస్.రాయవరం: కొరుప్రోలు సీతారామస్వామి దేవస్థానం భూములు కౌలుకు సాగు చేసుకునేందుకు వేలం నిర్వహిస్తున్నట్టు గ్రామ రెవెన్యూ అధికారి శ్రీధర్ తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటలకు దేవదాయ శాఖ అధికారులు ఆధ్వర్యంలో స్థానిక రామాలయం వద్ద వేలం పాట నిర్వహిస్తామన్నారు. కొరుప్రోలులో సర్వే నెంబర్ 101–4లో 4.86 ఎకరాలకుగాను రూ. 5 వేలు ధరావత్తు చెల్లించాలన్నారు.

మోదకొండమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

మాడుగుల: శ్రావణమాసం ఆదివారం సందర్భంగా మాడుగుల మోదకొండమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ముగిసిన సంతోషిమాత మాలధారణ



ఆలయంలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

మాడుగుల రూరల్: శ్రావణ మాసంలో భాగంగా కె.జె.పురం జంక్షన్‌లో సంతోషిమాత అమ్మవారి మాలధారణ కార్యక్రమం ఆదివారం ముగిసింది. అమ్మవారి మాలధారణ చేసిన 30 మంది ఈ నెల 2 నుంచి తొమ్మిది రోజుల పాటు అమ్మవారి సన్నిధిలో పూజా కార్యక్రమాలు నిర్వహించి, ఉదయం, సాయంత్రం పూజలు, అభిషేకాలు, భిక్ష చేశారు. ఆదివారం ఉదయం నుంచి మాలధారణ భక్తులు ఇరుముడులు ధరించి ఆలయం ఎదుట ఏర్పాటు చేసిన హోమం వద్ద పూజలు చేశారు. అనంతరం భక్తిశ్రద్ధలతో మాల విసర్జన చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కాళ్ల అమ్మతల్లినాయుడు, ఆలయ ప్రధానార్చకుడు దొంతుకుర్తి శ్రీనివాసరావు సారథ్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

రాఘవేంద్ర స్వామికి ప్రత్యేక పూజలు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని వేల్పులవీధి రాఘవేంద్ర గురు సార్వభౌమ 354వ ఆరాధన మహోత్సవాల్లో భాగంగా రాఘవేంద్ర స్వామికి ఆదివారం పూజలు నిర్వహించారు. సాయంత్రం రాఘవేంద్ర స్వామి బృందావన సమితి ఆధ్వర్యంలో వేదపారాయణం, అన్నమాచార్య అమృతవర్షిణి కోలాట బృందం వారి కోలాటం ప్రదర్శన కార్యక్రమాలు జరిగాయి.

మెరక పంటలకు ప్రాణం పోసిన వర్షం



కళకళలాడుతున్న కర్రపెండ్లం తోట

గొలుగొండ: తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో శుక్ర, శనివారాల్లో సాయంత్రం కురిసిన భారీ వర్షం మెరక పంటలకు ప్రాణం పోసింది. ఎండిపోతున్న వరి నారుమడులకు ఎంతో మేలు చేసింది. గడిచిన 15 రోజులు నుంచి ఎండల తీవ్రత వల్ల పంటలకు ఎంతో నష్టం కలిగే పరిస్థితి వచ్చింది. నారుమడులు సైతం ఎండిపోయాయి. మెరక భూముల్లో వేసిన ఆగారక, కర్రపెండ్లం, చేదుకాకర, బీర పంటలకు ఎంతో నష్టం వాటిల్లింది. మంచి వర్షాలు కురిసే సమయంలో ఎండల వల్ల ఆయా పంటలు సాగు చేసే రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పంటలు ఎండిపోయే పరిస్థితి రావడంతో ఆందోళన చెందారు. ఈ క్రమంలో శుక్ర, శనివారాల్లో సాయంత్రం భారీ వర్షం కురవడంతో పంటలు ఊపిరి పోసుకున్నాయి. మరో రెండు భారీ వర్షాలు కురిస్తే మండలంలో వరి నాట్లు ప్రారంభమయ్యే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు.